ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాడాలి

ఎంపీ ఈటల రాజేందర్

నిజాంపేట్: ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాడాలని ఎంపీ ఈటల రాజేందర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం బీజేపీ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షులు నరేంద్ర చౌదరి, ప్రసాద్‌రాజు, భిక్షపతియాదవ్ ఆయన్ని కలిశారు. ప్రజా వ్యతిరేక పాలన, హామీల హామలు, పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతం తదితర అంశాలపై ఈటల రాజేందర్ పలు సూచనలు చేశారు.

వేలం పాటలో పోటాపోటీ

నిజాంపేట్: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బాచుపల్లిలో గణేష్ లడ్డూకోసం వేలం పాటలు పోటాపోటీగా జరిగాయి. ఈ వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టు వస్త్రం, చిన్న లడ్డూ, పెద్ద లడ్డూ కోసం భారీ మొత్తంలో వేలం పాట కొనసాగింది. ఈ వేలం పాటలో జి.ఎస్.ఎన్.మూర్తి కుమార్తె స్వాతి పట్టు వస్త్రం రూ.75 వేలు కైవసం చేసుకున్నారు. చిన్న లడ్డూను జి.ఎస్.ఎన్.మూర్తి కుటుంబం రూ.6 లక్షలకు కై వసం చేసుకున్నారు. పెద్ద లడ్డూ చెంగల్ రెడ్డి అండ్ మిత్రులు రూ.5,61,000 కైవసం చేసుకున్నారు.

వాటర్ ప్లాంట్ నిర్వాహకులకు నోటీసులు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్న పలు వాటర్ ప్లాంట్‌లపై ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ అధికారులు 2 రోజులుగా నోటీసులు జారీ చేస్తున్నారు. అనుమతి పత్రాలతో 7 రోజులలోపు రెవెన్యూ కార్యాలయంలో సమర్పించాలని, లేదంటే వాటర్ ప్లాంట్‌లను సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు. సోమయ్య నగర్, రాజీవ్ గృహకల్ప, మైసమ్మ నగర్‌లతో పాటు పలు బస్తీలలో నోటీసులు జారీ చేశారు. సోమ, మంగళవారాల్లో సుమారు 25 వాటర్ ప్లాంట్‌లకు నోటీసులు ఇచ్చినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖలీం తెలిపారు.



ప్లాంట్ నిర్వాహకురాలికి నోటీసు అందజేస్తున్న అధికారి

గణపయ్యా.. పూజలందుకోవయ్యా!

ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

కుత్బుల్లాపూర్: గణేశ్ నవరాత్రోత్సవాల నేపథ్యంలో మంగళవారం ఆయా ప్రాంతాల్లోని మండపాల వద్ద అన్నదానాలు జరిగాయి. ఉదయం గణనాథులకు విశేష పూజలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం అన్నదానాలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారి లడ్డూల వేలం పాట నిర్వహించారు. భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం ఊరేగింపు మధ్య గణనాథులను నిమజ్జనానికి తరలించారు.



కొంపల్లి గజాన హోమ్స్‌లో పూజల్లో పాల్గొన్న మహిళలు



జీడిమెట్ల డివిజన్ వేంకటేశ్వరనగర్‌లో ..



అన్నదానంలో పాల్గొన్న కార్పొరేటర్ జగన్



గాంధీనగర్ కమ్యూనిటీ హాలు వద్ద..

వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన నేతలు



షాపూర్‌నగర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ తదితరులు

కుత్బుల్లాపూర్: దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని వక్తలు అన్నారు. వర్ధంతిని మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ అభిమానులు, కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివంగత నేత కృషి వల్లే నేడు పేదలకు 108 సేవలు, ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలవుతోందని, పేదలకు ఇళ్లు వచ్చాయని వక్తలు కొనియాడారు.



కొంపల్లిలో నివాళులర్పించిన..



నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ..

అనుమానాస్పదంగా వలస కార్మికుడి మృతి!

- గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియలకు ఏర్పాట్లు
- సమాచారంతో అడ్డుకున్న పోలీసులు

దుండిగల్: అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడిని మృతదేహానికి గుట్టు చప్పుడు కాకుండా చేస్తున్న దహన సంస్కారాలను దుండిగల్ పోలీసులు అడ్డుకున్నారు. దుండిగల్ మున్సిపల్ పరిధి గాగిల్లాపూర్‌లోని ప్రణీత్ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన నిర్మాణంలో ఉన్న ఓ విల్లాలో పశ్చిమబెంగాల్ రాష్ట్రం మంగ్దాకు చెందిన బాపస్‌దాస్(25) కూలీగా పని చేస్తున్నాడు. అతను అనుమానాస్పదంగా మృతి చెందడంతో మంగళవారం సదరు కాంట్రాక్టర్, కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం గుట్టు చప్పుడు కాకుండా దహన సంస్కారాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ విషయంపై బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి సాయంతో తోటి కార్మికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అంత్యక్రియలను అడ్డుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కుత్బుల్లాపూర్: కొంపల్లిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యకుడు రాజిరెడ్డి, కొంపల్లి బీజేపీ అధ్యక్షుడు పెద్దబద్దుల సతీష్ సాగర్ అన్నారు. మంగళవారం కొంపల్లి కమిషనర్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇటీవలే కురిసిన వర్షాలతో రోడ్లు గుంతలమయంగా మారాయని, రోడ్లపైన మురుగు నీరు నిలుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విష జ్వరాలు వ్యాప్తి చెందక ముందే అధికారులు మేల్కొని పారిశుధ్యంపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సరితారావు, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు బూర్గుబావి అశోక్, అసెంబ్లీ కో కన్వీనర్ శివాజీ రాజు, కొంపల్లి పట్టణ కోశాధికారి ఉప్పరి మహేందర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

తూము కాలువను పరిశీలించిన హైడ్రా ఎస్ఐ

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని తుమార్ చెరువు తూము కాలువను మంగళవారం హైడ్రా ఎస్ఐ మల్లేశ్వర్ పరిశీలించారు. తుమార్ చెరువు దిగువ భాగాన సర్వే నెంబర్ 29, 40, 42, 44, 63, 71, 72 ల మీదుగా వెళ్లే తూము కాలువ పలుచోట్ల కబ్జాకు గురైందని అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్, హైడ్రాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హైడ్రా ఎస్ఐ మల్లేశ్వర్ స్థానికులతో కలిసి కబ్జాకు గురైన తుమారు చెరువు తూము కాలువను పరిశీలించారు. గతంలో ఏ విధంగా ఉండేదని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయమై మరోసారి ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సంయుక్తంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. తూము కాలువకు పూర్వవైభం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అధికారి వెంట డప్పు అనిల్, రుషిరాజు, గడ్డం ప్రసాద్ కుమార్, కిరణ్ తదితరులు ఉన్నారు.

అక్రిలిక్ టీమ్ ఘన విజయం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) వన్డే లీగ్‌లో అక్రిలిక్ టీమ్ ఘన విజయం సాధించింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో అక్రిలిక్ 8 వికెట్ల తేడాతో కన్సల్ట్ టీమ్‌ను చిత్తు చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కన్సల్ట్ 17.2 ఓవర్లలో 36 పరుగులకే కుప్పకూలింది. ఒక్క బ్యాటర్ కూడా రెండంకెల స్కోరు చేయలేకపోయాడు. అక్రిలిక్ బౌలర్ కె.సుజయ్ రెడ్డి 8.3 ఓవర్లలో 17 పరుగులు మాత్రమే ఇచ్చి 6 వికెట్లు పడగొట్టడం విశేషం. మరో బౌలర్ డి.నిశాంత్‌కు 4 వికెట్లు దక్కాయి. అనంతరం అక్రిలిక్ 6.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 38 పరుగులు సాధించింది. వై.సునీత్ అత్యధికంగా 13 పరుగులు చేయగా.. 17 పరుగులు వైడ్‌ల ద్వారా వచ్చాయి.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న డీసీసీ మాజీ అధ్యక్షుడు ప్రతాప్

రంగారెడ్డినగర్: విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని డీసీసీ మాజీ అధ్యక్షుడు కె.ఎం.ప్రతాప్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్‌కు చెందిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు మంగళవారం హెచ్‌ఎంటీ కాలనీలో స్పోర్ట్స్‌మీట్ నిర్వహించారు. విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, 100 మీటర్ల స్ప్రింట్, రిలే పరుగుల పందెం పోటీలను ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రేమలత, ఫిజికల్ ట్రైనింగ్ ఉపాధ్యాయులు కిరణ్ సాగర్, ఉపాధ్యాయులు స్వర్ణ, స్నేహ తదితరులు పాల్గొన్నారు.